# పోలీసు అమరులకు ఘన నివాళి



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సెల్యూట్ చేస్తున్న అవినాష్ మహంతి



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబ సభ్యులతో..

**గచ్చిబౌలి:** విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు అమర వీరులకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి నివాళులు అర్పించారు. సోమవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని అమర వీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి రెండు నిమిషాలు మౌనం పాటించారు.ప్రజారక్షణ కోసం దేశ వ్యాప్తంగా 214 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని సీఎస్‌డబ్ల్యూ ఏడీసీపీ శ్రీనివాస్ రావు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఎస్‌ఐ కె.హన్మంత్ రెడ్డి, కానిస్టేబుల్ ఫయీమొద్దీన్, ఆర్మ్‌డ్ కానిస్టేబుల్ ఈశ్వర్ రావు కుటుంబ సభ్యులను కమిషనర్ సన్మానించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు వివిధ అంశాల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డెవిస్, డీసీపీలు డాక్టర్ వినీత్, కోటిరెడ్డి, రాజేష్, కె.సురేష్ కుమార్, సీహెచ్ శ్రీనివాస్, కె.నర్సింహ, ప్రసాద్, సృజన, బాలదేవి, సాయిశ్రీ పాల్గొన్నారు.

# ఓంకార్ సేవలు మరువలేనివి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**మియాపూర్:** తెలంగాణ సాయుధ పోరాట వీరుడు, మాజీ శాసన సభ్యులు మద్దికాయల ఓంకార్ అని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ అన్నారు. మియాపూర్‌లోని నడిగడ్డతాండ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓంకార్ వర్ధంతి కార్యక్రమంలో మైదంశెట్టి రమేష్ పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికోసం తొలిదశ రైతాంగ పోరాటంలో కీలకమైన పాత్ర పోషించిన ఓంకార్ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, ఇస్లావత్ దశరథ్‌నాయక్, లక్ష్మీ, నర్సింహ, గౌసీయాబేగం, కైరున్నీసాబేగం, ముఖేశ్వరి, రాములు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

**విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కో–కన్వీనర్ సుభాష్ చంద్ర**

**పటాన్‌చెరు టౌన్:** బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోకన్వీనర్ సుభాష్ చంద్ర అన్నారు. సోమవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రవీణ్ రెడ్డికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా సుభాష్ చంద్ర మాట్లాడుతూ.. యాదాద్రి గుట్టకు కుటుంబ సభ్యులతో వెళ్లిన కౌశిక్‌రెడ్డి ఆలయ ఆవరణలో రీల్స్ తీసి, సోషల్ మీడియాలో పెట్టడం దేవాలయ పవిత్రను దెబ్బతీయడమేనన్నారు. సామాన్య భక్తులకు ఫొటోలు తీయడానికి అనుమతించని సిబ్బంది, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రీల్స్ తీసేందుకు ఎలా అనుమతించారాని ప్రశ్నించారు. కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, భక్తుల మనోభావాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

# సృజనాత్మకతను బోధించలేం



సమావేశంలో మాట్లాడుతున్న నీలకంఠ

**చిత్ర దర్శకుడు నీలకంఠ**

**పటాన్ చెరు టౌన్:** నిజమైన సృజనాత్మకత లోపల నుంచి వస్తుందని, దానిని బోధించలేనిదని రెండు జాతీయ, ఐదు నంది అవార్డులను గెలుచుకున్న ప్రఖ్యాత చిత్ర దర్శకుడు నీలకంఠ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్–లో 'షూటింగ్ నీలకంఠ' పేరిట సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో తన అంతర్దృష్టిని పంచుకున్నారు. బహుముఖ ప్రజ్ఞ, వినూత్నమైన కథలు, సినిమాల్లో మార్పులేనితనం ప్రాముఖ్యతలను వివరిస్తూ, 'ఒక్కొక్కటీ మూడు లేదా నాలుగు కళా ప్రక్రియల కలయికతో నేను విభిన్న రకాల చిత్రాలను చేశాను. ప్రయోగాలు చేస్తూ ఉండండి, అది మీ మనస్సును చురుకుగా, సజీవంగా ఉంచుతుంది. మీరు ఎల్లప్పుడూ కొత్తదనాన్ని ఉత్పత్తి చేస్తున్నారని నిర్ధారించుకోవడానికి తాజా ఆలోచనలతో విభిన్న మార్గాలను అనుసరించండి' అని ఉద్బోధించారు. నీలకంఠ, ఆయన పనితీరును పరిచయం చేస్తూ షో, మిస్సమ్మ సహా ఆయన సినిమాలు బలమైన పాత్రలు, అర్థవంతమైన కథలు, వినోదం, ఆత్మపరిశీలన మధ్య సమతుల్యతను సాధించడంలో ప్రతిభను ప్రదర్శిస్తాయన్నారు. వెంకట సుబ్బు, డాక్టర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు

# అ సంపూర్తి పనులు వస్థల్లో ప్రజలు

- సమస్యల వలయంలో సాయికాలనీ
- రోడ్డుపై మురుగు పరుగు
- పట్టించుకోని అధికారులు



హఫీజ్‌పేట్‌లోని సాయికాలనీలో అసంపూర్తిగా రోడ్డు పనులు

**హఫీజ్‌పేట్:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయి కాలనీలో సమస్యలు వేధిస్తున్నాయి. అంతర్గత రోడ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మ్యాన్‌హోళ్లలో చెత్త చెదారం పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది. అభివృద్ధి పనులు అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడిగా పనులు చేపట్టిన సాయికాలనీలో మాత్రం అరకొరగా చేపడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా బస్తీ వాసులకు తాగునీరు అందిస్తున్నారు. కానీ గతంలో మంచినీటి బోర్లు వేసి వాటి కోసం ప్రత్యేక పైప్‌లైన్ వేసి నీటిని ట్యాంకుల్లో నింపి కుళాయిల ద్వారా సరఫరా చేసేవారు. ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా వస్తున్న నీటినే ప్రజలు వాడుతున్నారు. అత్యవసర సమయాల్లో వాడుకునే మంచినీటి బోర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో అవీ నిరుపయోగంగా మారాయి. కాలనీలో ప్రధాన రోడ్డు వేశారు, కానీ అంతర్గత రోడ్డు అసంపూర్తిగా ఉన్నాయి. సాయి కాలనీలో రెండు బోర్లు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా పనిచేయడం లేదు. బోర్ల నుంచి మంచినీటి ట్యాంకుల వరకు ఉన్న పైప్‌లైన్లు పగిలిపోయాయి.



కాలనీలో ఓపెన్ నాలాలలో చెత్త చెదారం పేరుకుపోవడంతో నాలాలు దుర్గంధంగా మారాయి అంతర్గత రోడ్డు మధ్యలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనాల రాకపోకలు, స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాయి కాలనీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన నీటి ట్యాంక్

## నియామకం



అజైలియు నియుమాయ్

**రాయదుర్గం:** వెస్ట్ వర్జీనియా యూనివర్సిటీలో విజిటింగ్ ఫెలోగా ప్రొఫెసర్ అజైలియునియు మాయ్ నియమితులయ్యారు. అక్టోబర్‌లో వెస్ట్‌వర్జీనియా యూనివర్సిటీ సోషియాలజీ అండ్ ఆంత్రోపాలజీ విభాగంలో విజిటింగ్ ఫెలోగా విజిటింగ్ ఫెలో పాత్రను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ హెడ్ విధులను నిర్వహించి ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. ఈశాన్య భారతదేశంలోని మణిపూర్‌లో మానవ అక్రమ రవాణా యొక్క ఖండనపై బహిరంగ ఉపన్యాసం అందించారు. అంతేకాక పలు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక ఉపన్యాసం చేశారు.

## ప్రత్యేక పూజలు

**రాయదుర్గం:** సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయంలోని అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ గణేషుడికి ప్రీతిపాత్రమైన 8 కిలోల బెల్లం ముద్దలు, గరకతో ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. షిర్డీ సాయిబాబా, కాశీవిశ్వేశ్వరస్వామి,అన్నపూర్ణా దేవి, ఆంజనేయుడు, కాళభైరవుడికి ప్రత్యేక అర్చనలు, పూజలు, అభిషేకాలు, అలంకారం చేశారు. వాసిరెడ్డిపార్వతి, భక్తులు పాల్గొన్నారు.

## మందుబాబులకు జరిమానా

**పటాన్‌చెరు టౌన్:** డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## యువ సంఘంలో చేరేందుకు 25 వరకు అవకాశం

**రాయదుర్గం:** భారత ప్రభుత్వంలోని విద్యా మంత్రిత్వ శాఖ యువ సంఘం (5వ దశ) కోసం పేర్లను నమోదు చేసుకునేందుకు అక్టోబర్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల యువకులు ఇందులో పాల్గొనడానికి అవకాశం ఉంది. యువ సంఘం కార్యక్రమం యువ సంఘం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో యువ సంఘం(5వ దశ) కార్యక్రమాలను నిర్వహించడానికి విద్యా మంత్రిత్వ శాఖ మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని నోడల్ విశ్వవిద్యాలయంగా నామినేట్ చేసింది. ఇప్పటికీ నాలుగు దశల యువ సంఘం కార్యక్రమం పూర్తయింది. ప్రస్తుతం అయిదవ దశ ప్రారంభించారు ఈ దశలో హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లోని ఎన్‌ఐటీతో కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని జత చేసింది.ఇది ప్రధానంగా ఉన్నత విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు, ఒక రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాలకు, కొంత మంది క్యాంపస్ యువకులతో కూడిన ఎక్స్‌పోజర్ టూర్‌లను నిర్వహించడంపై దృష్టి పెడుతుంది.

## రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

**శేరిలింగంపల్లి:** లింగంపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఏఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ రేవంత్‌రాజ్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కేర్ హాస్పిటల్, స్మార్ట్ వీసీఎస్ ఐ హాస్పిటల్స్‌ల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కూడా నిర్వహించినట్లు తెలిపారు.

## ఎల్లమ్మ చెరువు పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం

**ఆల్విన్‌కాలనీ:** రూ.2 కోట్లతో ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సీవరేజ్ డైవర్షన్ లైన్ పనుల్లో ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ ఆరోపించారు. స్థానికులతో కలిసి సోమవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యతగా జరగడం లేదని అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజాప్రతినిదులు, సంబంధిత అధికారులు ఎల్లమ్మ చెరువు సుందరీకరణ చేసి కబ్జాకు గురైన ప్రాంతాన్ని కూడా కాపాడాలని కోరారు.

## చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

**మణికొండ:** చెరువులో గుర్రపు డెక్క పెరిగి దోమల వ్యాప్తికి కారణం అవుతున్న నేపథ్యంలో దాన్ని తొలగించే పనులను చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ పెద్ద చెరువులో ఇటీవల పెద్ద ఎత్తున గుర్రపు డెక్క విస్తరించింది. దాంతో అందులో విపరీతంగా దుర్గంధం, దోమల వ్యాప్తికి కేంద్రంగా మారింది. అదే తరహాలో చిన్న చెరువు కూడా తయారైంది. ఇటీవల చిన్న చెరువులో మణికొండ మున్సిపాలిటీ సిబ్బందితో గుర్రపు డెక్కను తొలగించారు. పెద్ద చెరువులో ఎక్కువగా ఉండటంతో జీహెచ్‌ఎంసీ నుంచి గుర్రపు డెక్కను తొలగించే వాహనాన్ని రప్పించి సోమవారం నుంచి దాన్ని తొలగించే పనులను చేపట్టారు. దాంతో చుట్టు పక్కల నివాసితులు తమకు దోమల బెడదను నివారించేందుకు మున్సిపాలిటీ అధికారులు చేపట్టిన పనిని అభినందించారు.

## పేద విద్యార్థులకు స్టార్ హోటల్ భోజనం

**మణికొండ:** వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. రోజూ మధ్యాహ్నం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భోజనాన్ని తింటారు. అందుకు భిన్నంగా సోమవారం వారంతా ఏకంగా ఫైవ్ స్టార్ హోటల్ భోజనాన్ని తిన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న 240 మంది విద్యార్థులకు గోల్కొండ రిసార్ట్స్ చైర్మన్ రామిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బిర్యానీ, పలు రకాల వంటకాల భోజనాన్ని అందించారు. దాంతో విద్యార్థులు ఆనందంగా భోజనాన్ని ఆరగించి జన్మదినోత్సవాన్ని జరుపుకొంటున్న రామిరెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. గోల్కొండ రిసార్ట్స్ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... తమ వంతు సేవా కార్యక్రమాలలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, గండిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలను కల్పించాలమన్నారు.

## వెస్ట్ జోనల్‌లో చైన్‌మెన్ల బదిలీలు

**గచ్చిబౌలి:** టౌన్ ప్లానింగ్ విభాగంలో క్షేత్రస్థాయిలో కీలకంగా పని చేసే చైన్‌మెన్లు బదిలీ అయ్యారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో చైన్‌మెన్లు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎక్కువ కాలం ఒకే చోట విధులు నిర్వహిస్తుండటంతో కొంత మందిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్‌లో వివిధ సర్కిళ్లలో పని చేస్తున్న చైన్‌మెన్లను బదిలీ చేస్తూ జెడ్సీ ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో పని చేస్తున్న లక్ష్మీనారాయణను యూసూఫ్‌గూడ, జావెద్‌ను చందానగర్, చందానగర్ సర్కిల్‌లో పని చేస్తున్న ఐలయ్యను శేరిలింగంపల్లి సర్కిల్‌కు, కుమారస్వామిని పటాన్‌చెరు సర్కిల్‌కు, పటాన్‌చెరులో పని చేస్తున్న మల్లేష్‌ను శేరిలింగంపల్లి సర్కిల్‌కు, రాజేందర్‌ను చందానగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఉప కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల సిఫారరు మేరకు బదిలీలు జరిగినట్లు సమాచారం.

## నూతన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

**శేరిలింగంపల్లి:** పాపిరెడ్డినగర్ నుంచి రాజీవ్‌గృహకల్ప సెప్టిక్ ట్యాంక్ వరకు నూతనంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. గతంలో ఆరు ఇంచుల పైప్‌లైన్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం పెరిగిపోవడంతో ఇక్కడ నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్గంధంగా మారుతోంది. పాపిరెడ్డినగర్, రాజీవ్ గృహకల్ప సెప్టిక్‌ట్యాంక్ నుంచి వచ్చే మురుగు అంతా గోపి చెరువులోకి చేరి కలుషితమై దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని వినతిలో కోరారు.

## ప్రజావాణిలో 12 ఫిర్యాదులు



ప్రజావాణిలో పాల్గొన్న ముకుంద్‌రెడ్డి

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తెలిపారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 3, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్కటిగా దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

**చందానగర్ సర్కిల్‌లో..**

**చందానగర్ :** చందానగర్ సర్కిల్–21 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 7 ఫిర్యాదులు వచ్చినట్లు ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ–4, టౌన్‌ప్లానింగ్ 01, ఇంజనీరింగ్ విభాగాలకు–02 ఫిర్యాదు వచ్చాయన్నారు.

## యువకుడి అదృశ్యం



అనిల్

**మియాపూర్:** ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం వివరాల ప్రకారం..అస్సాం రాష్ట్రానికి చెందిన అనిల్(32) బతుకు దెరువు నిమిత్తం నగరానికి వ చ్చి మియాపూర్ న్యూ కాలనీలో ఉంటూ ఓ అ పార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న బయటకు వెళ్తున్నానని తోటి స్నేహితుడికి చెప్పి వెళ్లి రాత్రైనా రాలేదు. సమీప ప్రాంతాల్లో వెతికి, తెలిసిన వారితో ఆ రా తీసినా ఫలితం లేకపోవడంతో సోదరుడు అంకూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**మరో ఘటనలో మహిళ..**



లక్ష్మమ్మ

**చందానగర్:** ఓ మహిళ అదృశ్యమైన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంధ్యా వివరాల ప్రకారం.. చందానగర్ ఇంద్రానగర్‌కు చెందిన చెరుకుల శ్రీను కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని తల్లి లక్ష్మమ్మ (59) ఇంట్లో ఉంటూ శ్రీను పిల్లలను చూసుకుంటుంది. గత నాలుగు నెలల నుంచి మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నెల 12న శ్రీను కూలీ పనుల కోసం వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చే సరికి తల్లి లక్ష్మమ్మ కనిపించలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# అధ్వానంగా రహదారులు



నందిగామ చౌరస్తా వద్ద రోడ్డు పరిస్థితి

**పటాన్‌చెరు:** నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పటాన్‌చెరు– ఇంద్రేశం మీదుగా మల్కాపూర్ రోడ్డు తో పాటు పటాన్‌చెరు– భానూర్ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పటాన్‌చెరు భానూర్ మీదుగా రెండు జిల్లాలను కలుపుతూ ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు పక్కనే విశాఖ స్టీల్, కంటైనర్ కార్పొరేషన్ సంస్థలు ఉన్నాయి. ఆ సంస్థలకు ప్రతి రోజు వందలాది వాహనాలు వస్తుంటాయి. దీంతో భానూర్ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. భానూర్ రోడ్డు, ఇటు హైదరాబాద్– ముంబాయి, అటు బెంగళూరు– హైదరాబాద్ రోడ్డుకు అనుసంధానంగా ఉంటుంది. భానూర్ నందిగామ ప్రాంతాల్లో ఇంటర్నేషన్ కాలేజీలు , స్కూళ్లు ఉన్నాయి. అలాగే, పాశమైలారం పరిశ్రమకు వెళ్లే వాహనాలు కూడా కర్దనూర్ జంక్షన్ వరకు వస్తున్నాయి. దీంతో ఆ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు గోతులమయం కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గోతుల కారణంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇంద్రేశం మీదుగా మల్కాపూర్ రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనిని కూడా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గం పరిధిలో ఈ రెండు రోడ్లు పూర్తిగా పాడైయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**విస్తరణకు రూ.95 కోట్లు అవసరం**

పటాన్‌చెరు–భానూర్ రోడ్డు విస్తరణకు రూ.95 కోట్లు అవసరం. ఆ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ఇప్పుడున్న రోడ్డుకు మరమ్మతులు త్వరలోనే చేపడతామని ఆర్ అండ్ బీ డీఈఈ రామకృష్ణ చెప్పారు. పటాన్‌చెరు మల్కాపూర్ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

– రామకృష్ణ, డీఈఈ, ఆర్అండ్‌బీ



పటేల్‌గూడ పంచాయతీ పక్కన రోడ్డు ఇలా..

# బాధిత రైతులకు న్యాయం చేయండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

**జిన్నారం (పటాన్ చెరు):** ప్రభుత్వం రైతుల నుంచి తీసుకున్న భూములకు సంబంధించి ఎకరాకు 600 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ భిక్షపతికి బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. సోమవారం జిన్నారం, జంగంపేట గ్రామాల రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు రెవెన్యూ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 1001, 376లో గల రైతుల భూములను హెచ్‌ఎండీఏకు కేటాయించారు. నష్టపరిహారం కింద ఒక ఎకరాకు 600 గజాలు ఇస్తామని చెప్పి, రెండు సంవత్సరాలు గడిచినా ఎలాంటి పరిహారం ఇవ్వలేదని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం బాధితులకు హెచ్‌ఎండీఏ లేఅవుట్ చేసి ఎకరాకు 600 గజాల ప్లాట్లను ఇవ్వాలన్నారు. లేని యెడల రైతుల నుంచి తీసుకున్న భూములను తిరిగి పట్టాలు చేసి అప్పగించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తామని అధికారులను హెచ్చరించారు. ఉమ్మడి మండలాల నాయకులు మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, స్థానిక నాయకులు బాధిత రైతులు పాల్గొన్నారు.